క్లుప్తంగా

చిత్రలేఖనం పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, అమరావతి ఐకాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చిత్రలేఖనం పోటీల బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ ఆదివారం తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని అమరావతి ఐకాన్‌లో చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. ఇప్పటికే సుమారు 400 మందికి పైగా బాలబాలికలు పేర్లను నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. విజేతలకు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు చెట్టి రామకృష్ణయ్య, బాలోత్సవం ఉపాధ్యక్షులు జి.ఎస్.ఆర్. మోహనరావు, కార్యదర్శి జెట్టి శ్రావణి, ట్రైనర్ చంద్ర ఓబులరెడ్డి, అమరావతి ఐకాన్ వైస్ ప్రెసిడెంట్ అలహరి శివ సతీష్‌కుమార్, ట్రాఫిక్ క్లబ్ తాడేపల్లి ఫౌండేషన్ చైర్మన్ గోపు నాగరాజు బహుమతులు అందజేయనున్నారని తెలిపారు. విజేతలకు బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు ఇస్తామని పేర్కొన్నారు.

ఏసీసీ కార్మికుల సమస్యలపై స్పందించాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు శుక్రవారానికి 248వ రోజుకు చేరాయి. శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేసిన అనంతరం దుర్గారావు మాట్లాడుతూ యాజమాన్యంతో ప్రభుత్వం చర్చలు జరిపి కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎన్నికల ముందు నారా లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినపుడు తమ పార్టీ అధికారంలోకి వస్తే తప్పకుండా ఏసీసీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, దాన్ని నెరవేర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు నారదాసు సుబ్బారావు, వై. సాంబశివరావు, గురవయ్య, కార్మికులు కొండయ్య, హగ్గయ్య, రిబ్కా, సారమ్మ, శివకుమారి, ఇస్మాయిల్, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం



మోతడక(తాడికొండ): మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా తాడికొండ మండలం మోతడక సబ్ సెంటర్ పరిధిలో ప్రోగ్రాం ఆఫీసర్ వి. రాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ సిబ్బంది వెళ్లి కిల్కారి కాల్ సర్వీస్ గురించి అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కిల్కారి ప్రోగ్రాంను గర్భిణులు, బాలింతలు సంక్షేమంతో పాటు మాత శిశు మరణాలు తగ్గించాలనే ఉద్దేశంతో ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. కిల్కారి కాల్ ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్య సమాచారం అందిస్తారని తెలిపారు. గర్భిణీ నాలుగో నెల మొదలుకొని పుట్టిన బిడ్డ సంవత్సరం వరకు 01244451660 నుంచి కాల్స్ వస్తాయని పేర్కొన్నారు. మరలా ఆ సమాచారాన్ని వినాలి అంటే 14423 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు చేసి తెలుసుకోవచ్చని వివరించారు. కిల్కారి సేవలను గర్భిణులు, బాలింతలు ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ శివకుమారి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

'బ్రేక్'లు లేని అవినీతి

- ఎంవీఐ కార్యాలయంలో లంచావతారాలు
- సీఎస్‌సీ సెంటర్ల ముసుగులో దోపిడి





ప్రభుత్వ అనుమతులు లేకుండా రవాణాశాఖ సేవలు అందిస్తున్న కమ్యూనికేషన్స్

మంగళగిరి: నగర పరిధిలో నవులూరులో గల మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం అవినీతిమయంగా మారింది. పేరుకు ప్రైవేటు వారికి సీఎస్‌సీ సెంటర్ల పేరుతో అప్పగించినా, సేవలన్నిటినీ ఎంవీఐ కార్యాలయం అందించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కార్యకర్తలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో సీఎస్‌సీ సెంటర్లు కేటాయించారు. వాస్తవానికి లైసెన్స్, వెహికల్ ఆధార్ సీడింగ్, ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్, వెహికల్ ఫిట్‌నెస్ స్లాట్ బుకింగ్ ,డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్, ఎండార్స్‌మెంట్,చిరునామా మార్పు, వెహికల్ రిజిస్ట్రేషన్ రెన్యువల్, ట్రాన్స్‌ఫర్, ఎన్ఓసీ ,టాక్స్ చెల్లింపులు, సేవలను సచివాలయాల్లో అందజేయాలి.

కార్యకర్తలకు సీఎస్‌సీ సెంటర్ల కేటాయింపు

సచివాలయాల్లో సేవల పక్కన పెట్టి ప్రస్తుతం కొంతమంది టీడీపీ కార్యకర్తలకు సీఎస్‌సీ సెంటర్లను ఇచ్చారు. వీటిల్లో ఆయా సేవలకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులకు రెండు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ప్రభుత్వానికి చలానా కట్టినా సెంటర్లలో మాత్రం దానికి రెండింతలు చెల్లిస్తేనే పని జరుగుతోంది. లేదంటే వెళ్లిపోవచ్చని తెగేసి చెబుతుండటంతో వాహనదారులు చేసేదేమి లేక చదివించుకుంటున్నారు. సీఎస్‌సీ సెంటర్లపై అధికారుల పర్యవేక్షణ కూడా కరువైంది. ఆదాయం సమకూరుతుండడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సీఎస్‌సీ సెంటర్లపై పర్యవేక్షణ చేసి వాహనదారులు దోపిడీకి గురికాకుండా చూడాలి. ఈ విషయాన్ని మంగళగిరి ఎంవీఐ బాలకృష్ణ వివరణ కోరగా తాను వారం క్రితమే బాధ్యతలు తీసుకున్నానని తెలిపారు. తమ దృష్టికి వస్తే తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ఓట్ల తొలగింపునకు బీజేపీ, ఈసీ కుమ్మక్కు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్: బీజేపీ, ఎన్నికల కమిషన్ కూడబలుక్కుని దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ఓటర్లను తొలగించడానికి పూనుకున్నారని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ విమర్శించారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి సెంటర్, తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ సెంటర్లలో ఓటర్ల తొలగింపునకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. రవి, తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నేతాజీ మాట్లాడుతూ తమకు వ్యతిరేకంగా ఉన్న వారి ఓట్లను తొలగించడానికి బిహార్ నుంచి బీజేపీ ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందని విమర్శించారు. ఎన్నికల కమిషన్ బీజేపీతో కుమ్మక్కైందని మండిపడ్డారు. ఓటర్ గుర్తింపునకు ఆధార్ సరిపోతుందని సుప్రీం కోర్టు చెప్పినా ప్రభుత్వం మొండిగా ముందుకు పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. రవి, నాయకులు జె. నవీన్ ప్రకాష్, సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకుల వేముల దుర్గారావు మాట్లాడుతూ కోర్టులను ప్రభావితం చేస్తూ ఎన్‌డీఏ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జి. సుబ్బారెడ్డి, వల్లభాపురం వెంకటేశ్వరరావు, టి. బక్కిరెడ్డి, ఈమని రామారావు, ఎస్‌కే పేరు సాహెబ్, డి. విజయబాబు, డి.వి. భాస్కరరెడ్డి, బి. రామారావు, కె. మేరి, ఇమ్మానియేల్, వెంకట నారాయణ, ఆర్.వి. రాఘవయ్య, ఎస్. దుర్గారావు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే !

నిడమర్రు(మంగళగిరి): ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే ఓటు హక్కు ఎంతో విలువైనదని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. రవి అన్నారు. ప్రభుత్వం వ్యతిరేక ఓట్లు తొలగింపు కార్యక్రమం చేపడుతున్నా, ఎలక్షన్ కమిషన్ ఒత్తాసు పలకడం ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడమేనని తెలిపారు. ఎలక్షన్ కమిషన్‌ను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు భాగ్యరాజ్ అధ్యక్షతన నిరసన కార్యక్రమంలో రవి మాట్లాడుతూ ఇప్పుడు బిహార్‌తో మొదలైన ఓట్ల తొలగింపు, రేపు పశ్చిమ బెంగాల్ ఆ తర్వాత దేశమంతా ఇలాంటి ఎత్తుగడే అనుసరించే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గైరుబోయిన నాగేశ్వరరావు, జొన్నకూటి నవీన్ ప్రకాష్, నానయ్య పాల్గొన్నారు.

ఏకపక్షంగా లక్షల ఓట్ల రద్దు దారుణం

మంగళగిరి టౌన్: ఓట్ల సవరణల పేరుతో ఏకపక్షంగా 67 లక్షల ఓట్లను బిహార్‌లో రద్దు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని సీపీఎం జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు జె.వి. రాఘవులు అన్నారు. మంగళగిరి అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యక్రమానికి సీపీఎం పట్టణ కార్యదర్శి వి.వి. జవహర్‌లాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరుగా నమోదు అవ్వడానికి ఆధార్, రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటారని తెలిపారు. అందుకు భిన్నంగా ఎన్నికల కమిషన్ ఇక్కడ ప్రత్యేక సమగ్ర సవరణల పేరుతో 'ఇక్కడే జన్మించాను' అని రుజువు చేసే పత్రాలను సమర్పించమనడంతో పేదలు, కూలీలు, వలస కార్మికులు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పి. బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాలాజీ, నాయకులు ఎం. చంద్రరావు, ఎం. నాగేశ్వరరావు, టి. శ్రీనివాసరావు, కేవీపీఎస్ నాయకులు బి. స్వామినాథ్ పాల్గొన్నారు.

పట్టుదల, అంకితభావంతోనే సివిల్స్ సాధన



సదస్సులో ప్రసంగిస్తున్న విజయకుమార్

తాడేపల్లి రూరల్: దేశంలో అత్యున్నతస్థాయి ఉద్యోగమైన ఐఏఎస్, ఐపీఎస్ సర్వీసులను సాధించాలంటే పట్టుదల, అంకితభావం అనే రెండు ప్రధాన లక్షణాలను విద్యార్థులు ముందుగా అలవర్చుకోవాలని రాష్ట్ర ఇన్‌కంటాక్స్ అసిస్టెంట్ కమిషనర్ దోనేపూడి విజయకుమార్ సూచించారు. కేఎల్ యూనివర్సిటీలో బీపి (ఐఏఎస్) ఆధ్వర్యంలో సివిల్స్‌పై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఇన్‌కంటాక్స్ అసిస్టెంట్ కమిషనర్ దోనేపూడి విజయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఆంగ్ల దినపత్రిక, పోటీ పరీక్షల మేగజైన్స్ చదవడం ఒక ఎత్తయితే, చదివిన దానిలో ప్రధాన విషయాన్ని క్లుప్తంగా రాసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. అనేక పుస్తకాలను చదవాలనే ఉత్సాహం తగ్గించుకుని, కొన్ని ప్రామాణిక గ్రంథాలను ఎంచుకుని వాటిని అనేకసార్లు అంకితభావంతో అధ్యయనం చేయడం ద్వారా లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. వర్సిటీ బీపి (ఐఏఎస్) విభాగాధిపతి బి. శివనాగయ్య మాట్లాడుతూ సివిల్స్ బోధనను అనుభవం కలిగిన ప్రొఫెసర్లు, సివిల్ సర్వీసెస్ ట్రైనర్లతో ఒక క్రమబద్ధమైన ప్రణాళికతో కోర్సును రూపొందించామని తెలిపారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే వేల గ్రంథాలతో యూనివర్సిటీ గ్రంథాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని చెప్పారు. కోర్సులో చేరిన విద్యార్థులు తమ కలలను నిజం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని తృతీయ సంవత్సరం విద్యార్థిని లక్ష్మి నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులంతా విజయకుమార్‌తో తమ సందేశాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో బీపి విభాగ ఉప అధిపతి అనిల్ కుమార్, సహాయాచార్యులు ప్రజాపతి పాల్గొన్నారు.

యువకుడికి విముక్తి



చందు (ఫైల్)

తాడేపల్లి రూరల్ : ఉద్యోగం కోసం కాంబోడియా వెళ్లి సైబర్ నేరగాళ్ల చేతిలో చిత్ర హింసలకు గురైన తాడేపల్లికి చెందిన చందు అనే యువకుడిని మంత్రి నారా లోకేష్ సహకారంతో స్వదేశానికి రప్పించారు. ఉద్యోగం కోసం చందు కాంబోడియా వెళ్లగా అక్కడ సైబర్ క్రైమ్ చేయమని ఆదేశించారు. చందు దానికి అంగీకరించకపోవడంతో అతడిని చీకటి గదిలో బంధించారు. దీంతో హలోడాట్ లోకేష్‌కు మెయిల్ ద్వారా సమాచారం అందించగా, ఆయన చొరవతో యువకుడిని క్షేమంగా స్వస్థలానికి చేర్చారు.

పోలీసుల అదుపులో రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి

తాడికొండ: రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి రెండు బస్తాల బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన తుళ్లూరు మండల పరిధిలో జరిగింది. వైకుంఠపురం గ్రామానికి చెందిన గంగుల భాగ్యరాజు ద్విచక్ర వాహనంపై బియ్యం తరలిస్తుండగా తుళ్లూరు పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



తాడికొండ: మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయని తాడికొండ ఎస్ఐ జోజి హెచ్చరించారు. తాడికొండ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. అతిగా మద్యం తాగి వాహనం నడుపుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడికొండ: సబ్ స్టేషన్‌లో మరమ్మతుల సందర్భంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈఈ నాగమల్లేశ్వరరావు తెలిపారు. మండలంలోని మూడు సబ్‌స్టేషన్‌లు కంతేరు, మోతడక, తాడికొండ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

తుళ్లూరు మండలంలో....

రాయపూడి, దొండపాడు, అనంతవరం సబ్ స్టేషన్ పరిధిలోగల అన్ని గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ చిలక రాజు తెలిపారు.

ఫిరంగిపురం మండలంలో..

మండల పరిధిలోని గ్రామాలకు మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

మోటార్లు రిపేరు చేసి సాగునీరు అందించాలి



ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వద్ద పంపు సెట్లను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ మోటార్లను శుక్రవారం ఏపీ రైతు, కౌలు రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ స్కీం ద్వారా 3,769 ఎకరాలకు సాగునీరు అందించే వాటర్ పంపుసెట్లు పాడైపోయాయని తెలిపారు. పైపులకు రంధ్రాలు పడి నిరుపయోగంగా ఉన్నాయని చెప్పారు. నీటి పారుదల శాఖ అధికారులు మోటార్లను రిపేరు చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. రైతుల పొలాలు ఎండిపోతున్నా పంపింగ్ స్కీమ్ ద్వారా సాగు నీటిని అధికారులు వదలడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 82 వేల కోట్లతో బనకచర్ల ప్రాజెక్టు గురించి మాట్లాడుతోందే కానీ, చిన్న పంపింగ్ స్కీము మోటార్లను రిపేరు చేయడం లేదని విమర్శించారు. పాడైపోయిన వాటర్ పైప్‌లైన్లు మార్చి, రైతుల పొలాలకు సాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1967లో ఏర్పడిన ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ తాడేపల్లి మండలంలోని ఐదు గ్రామాలకు ఐదు మోటార్ల ద్వారా సాగునీరు అందించేదని తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగం ప్రబలడంతో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు పెరిగాయన్నారు. అక్కడ వాడిన వ్యర్థపు నీరు పంట కాలువల్లో పెడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రస్తుతం ఐదు మోటార్లకు గాను రెండు మాత్రమే పనిచేస్తున్నాయని చెప్పారు. నీటి పారుదల అధికారులు స్పందించి పాడైన మోటార్లను రిపేరు చేసి, పంట కాలువలో వ్యర్థాలు కలవకుండా తగు చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతు సంఘం మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు పాల్గొన్నారు.

అసమర్థ పాలనకు నిదర్శనం కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లి రూరల్: రాష్ట్రంలో అసమర్థ పాలనకు నిదర్శనం కూటమి ప్రభుత్వమేనని, ఎప్పుడు పొత్తులతో బాబు అధికారం చేపట్టినా పేద ప్రజలను మరచి కార్పొరేట్ కంపెనీలకు భజన చేస్తారని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని మెల్లెంపూడిలో శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు అమరా నాగయ్య అధ్యక్షత 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా దొంతిరెడ్డి వేమారెడ్డి హాజరయ్యారు. ముందుగా ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు చూపించి ఎంత మోసపోయారో వివరించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడు ప్రమాణ స్వీకారం చేసినా కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతూ, పేద ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెడతారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని, ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రాబోయే కాలంలో ప్రజలు బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధి చెందాలన్నా, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలన్నా, మన బిడ్డలు ఉన్నత చదువులు చదవాలన్నా మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పాటిబండ్ల కృష్ణమూర్తి, ప్రముఖ న్యాయవాది బాజీ గంగాధర్, చందు, కళ్లం పిచ్చిరెడ్డి, బొమ్మారెడ్డి రాజా రామిరెడ్డి, కృపారావు, బాణావత్ వెంకటేశ్వరరావు, నెమలికంటి పుల్లారావు,తోకల రాంబాబు, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, షేక్ అల్లం బుదే, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు రత్నరాజు, ఈ. పృథ్వి, షేక్ ఢిల్లీ నాగులు, బి. సాంబిరెడ్డి, సాయి ప్రతాప్ రెడ్డి, వేణుగోపాలరెడ్డి, టి. విజయ్‌కుమార్, జయరావు తదితరులు పాల్గొన్నారు.

ఓట్లేసిన ప్రజలను మళ్లీ మోసం చేసిన బాబు

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి



కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు వివరిస్తున్న శివరామిరెడ్డి

ఫిరంగిపురం: నమ్మిన వారిని నట్టేట ముంచడం నైజంగా పెట్టుకున్న చంద్రబాబు గత ఎన్నికల్లో ఇచ్చిన ష్యూరిటీలను నమ్మి ఓట్లేసిన ప్రజలను మళ్లీ మరోసారి మోసం చేశాడని పార్టీ ఫిరంగిపురం మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని హౌస్ గణేష్‌పాడు గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత ఎన్నికల్లో బాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సైతం ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇంకా బాబు హామీల అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వకపోవడం ఆయన చేతగాని పాలనకు నిదర్శనమని విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కరోనా కష్టకాలంలోనూ ప్రజలకు సంక్షేమ పథకాలను నేరుగా ఖాతాలకే మళ్లించి, ఒక్క రూపాయి అవినీతి లేకుండా జనరంజక పాలన అందించారని తెలిపారు. నేడు కూటమి పాలనలో ఏపీ అవినీతిలో కూరుకుపోయి, ప్రజలకు సమాధానం దాటవేస్తూ సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. రాష్ట్రంలో పేదలు నిరుపేదలుగా మారడమే తప్పా అభివృద్ధి జాడలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం గ్రామస్తులకు కరపత్రాలు అందజేశారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా బాబు ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారో ఓసారి పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, వివిధ విభాగాల నాయకులు చిట్టా అంజిరెడ్డి, చేవూరి రామ్మోహనరెడ్డి, సయ్యద్ సైదులు, బోయలపల్లి సాల్మన్, పెరికల చిన్న, మాయకుంట్ల రాయప్ప, పార్టీ గ్రామ అధ్యక్షుడు జోజప్ప, దాసరి మెల్కియా, జొన్నలగడ్డ ఆనంద్, దాసరి సురేష్, కొమ్మారెడ్డి ప్రవీణ్ రెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, స్వర్ణ చిన్నప్ప పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మీ వ్రతాలు



కనకదుర్గ ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



వాయనాలు అందుకుంటున్న మహిళలు



ఫిరంగిపురంలో దుర్గామాతకు పూజలు

మంగళగిరి : శ్రావణ మాసంలో అత్యంత ప్రధానమైనది వరలక్ష్మీ వ్రతం. ఏటా రెండవ శుక్రవారం మహిళలు వ్రతం చేసుకుంటారు. ఈ ఏడాది శ్రావణ మాసంలో ఐదు శుక్రవారాలు రావడంతో మూడవ శుక్రవారం వ్రతం చేసుకోవాలని అర్చకులు, పండితులు చెప్పడంతో పూజలు పెద్దఎత్తున జరిగాయి.

మహిళలు తెల్లవారు జామునే నిద్రలేచి తలస్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ప్రత్యేకంగా వరలక్ష్మీని అలంకరించి, భక్తులు పూజలు చేశారు.

ఫిరంగిపురంలో..

మండలంలోని అమీనాబాద్, వేములూరిపాడు, నుదురుపాడు, వేమవరం, తక్కెళ్లపాడు గ్రామాల్లోని ఆలయాల్లో శ్రావణమాసం సందర్భంగా విశేషపూజలు చేశారు. మండల కేంద్రంలోని విజయదుర్గా మాత ఆలయంలో అమ్మవారికి అర్చకులు రాజేంద్రశర్మ అష్టోత్తర,సహస్రనామ పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖమండపంలో భక్తులతో సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజలు చేయించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎంబుక్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఎంబుక్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు ఎస్.ఎస్. చెంగయ్య, వి.వి. జవహర్‌లాల్ డిమాండ్ చేశారు. కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న ఎంబుక్ కార్మికులకు 15 వేల రూపాయలు వేతనం చెల్లించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మంగళగిరి కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరుగుతున్న నిరసన కార్యక్రమం శుక్రవారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గేటు ఎదుట కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కార్మికుల శ్రమను దోపిడీ చేయడం సబబు కాదని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ ఎం. బాలాజీ, సీనియర్ నాయకులు జె.వి. రాఘవులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. బాలకృష్ణ, వివిధ సంఘాల నాయకులు ఎం. చంద్ర, టి. శ్రీనివాసరావు, బి. స్వామినాథ్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్తు అంధకారం



ఫిరంగిపురం: మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్తు అంధకారమయం అవుతుందని ఫిరంగిపురం సీఐ శివరామకృష్ణ అన్నారు. ఫిరంగిపురంలోని వసంతనగర్‌లో శుక్రవారం 'మాదక ద్రవ్యాల వాడకంతో యువత భవిష్యత్తుకు ప్రమాదం' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్‌కు బానిసలైన యువత జీవితాలను అంధకారమయం చేసుకోవడంతో పాటు తమ కుటుంబాలను కూడా చీకటి పాలు చేస్తున్నారని తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా మాదక ద్రవ్యాలు అమ్మడం లేదా వినియోగించడం జరిగితే తమకు సమాచార అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, పలువురు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.